# చిత్రకారుని చిత్రాలు

శ్రీ కావుటూరు వెంకటనారాయణరావు.

సాయంత్రం అయిదుగంటలకు "సుందర భవన్ శీతల గృహం" నుండి బయటబడి ఒక్క త్రేపు త్రేపాడు చెయ్యనులు. ఆ త్రేపుతో ఘుమ్మని వాసన గొట్టింది. ఎదురుగా జనరల్ రేడియో "అందమె ఆనందం" అనేపాట వీనుల విందుగా వుందతనికి. ఇంకా అతడా భవనం మెట్లుదిగలేదు. దిగబోతుంటే ప్రక్కనున్న బంకు బంగారయ్య అతనికో కమ్మని కిళ్ళీ కట్టిచ్చాడు. అతనికి ఆనందంలో ఆనందం చేకూరింది. మెల్లగా సూర్యుని కడ్డంగా నిలచివున్న మేడల నీడలలో నడచిపోయాడు. అక్కడక్కడ అతనికి తెలియకుండానే నిలచిపోతున్నాడు. అతని దృష్టంతా తనుదాటిపోతున్న గోడలచే ఆకర్షింపబడింది. ఆ గోడల తట్టుచూచి కాసేపునిలచి యేదో ఆలోచించడం మొదలెట్టాడు.

ఆగోడలమీద అతని దృష్టి నిలువడానికి కారణం వాటిమీద బొమ్మలే. ఆ బొమ్మలు రంగులతో వేసినవికావు. వాటిని చూచి వారికి, ఆ బొమ్మలు వేయడానికి, ప్రసిద్ధ చిత్రకారుని దగ్గరియే సాధనమూ అనవసరమని తెలుస్తుంది. ఇంతా ఆ బొమ్మలు బొగ్గుతో వేసినవి; సున్నపు పెళ్ళలతో వేసినవి. ఆ బొమ్మలలో మానవుని వూహకురాగల సకల దేవతలూ వున్నారు. సర్వమానవాకృతులూవున్నాయి. ఆ బొమ్మలను చూచి, అందులోని మానవాకృతులకు యీలోకంతో యెలాంటి సంబంధమున్నదో యెవరయినా ఆలోచించగలరు. ఆ బొమ్మలు బొగ్గుతో వేసినవైనప్పటికీ వాటికి విలువలేదనుకోవడం కళా పోషకుడు కాని వాని పోకడ. ఆ బొమ్మలలో కళ వుట్టిపడుతుంది. సహజమైన నాణ్యత గోచరిస్తుంది. ఆకళ మానవుడు ఆశిస్తే వచ్చేదిగాదు. నేర్చుకున్నా అంత సహజత్వముగోచరించదు. అది ఆ బొమ్మలు వేసిన వాని జన్మహక్కు! ఆ బొమ్మలు చూచినవాడు ఓ అయిదు నిముషాలు ప్రతిఒక్క చిత్రం ముందు నిలవందీ కదలలేదు.

వాటిని గురించే చెయ్యనులు ఆలోచిస్తున్నాడు. వాటి చిత్రకారుడెవడో అతనికి తెలియదు. కానీ అతను వూహకుమటుకు యెవడో ఒకడై వుంటాడనుకున్నాడు. అతడా బొమ్మలను నాలుగు నెలలనుంచీ ప్రతిదినం తప్పక చూస్తున్నాడు. ఇంతకాలంనుంచీ చూస్తున్నవి పాత బడుటకు బదులు, అవి అతనికిదిన దినం క్రొత్తగానే వున్నాయి అందుకనే వాటి చిత్రకారుని అంతగా మెచ్చుకున్నాడు. అందుకనే అతనికా చిత్రకారుని చూడాలన్న వుబలాటం జాస్తయింది.

చెయ్యనులు మెల్లగా [illegible]కడ్డంగా పాగుతున్న వుయ్యాలకాలవదాటి మునిసిపల్ మార్కెట్ చేరుకున్నాడు. తనదోవలో గాంధీది, నెహ్రూది, పటేలుది, రామకృష్ణునిది, రమణమహర్షిది, యింకా అనేక ప్రసిద్ధ పురుషుల చిత్రాలు అనేకం గోడలమీద చూచాడు.

మునిసిపల్ మార్కెట్ గోడ చాలా పెద్దది. క్రొత్తగా వెల్ల వేశారేమో తెల్లగా మెరిసిపోతుంది. ఇప్పటికి చెయ్యనులు యే బొమ్మాలేని గోడను అదొక్కటే చూస్తున్నాడు. ఆ గోడముందు ఓ పెద్ద గుంపు గుమిగూడివుంది. చెయ్యనులు మొదట ఏదో గారడీ జరుగుతుందనుకున్నాడు. కానీ ఆ సూచనలేవీ అతనికి కనుపించలేదు. అంత మంది యేదోవింత చూస్తుంటే చెయ్యనులు ఆగలేక తనూ వారితో కలసిపోయాడు. కానీ, చెయ్యనులు కేవింతా అగుపించలేదు. ఆ గుంపు నడుంగల ఓ వ్యక్తి ఓ సిమెంటు బండమీద కూర్చునివున్నాడు.

ఆ వ్యక్తి ఓ యిరవైయేండ్ల యువకుడు. అతనిని చూచిన వెంటనే ఆమాయకుడని తెలుస్తుంది.

ఎన్నాళ్ళనుండి వుపవాసదీక్షతో వున్నాడోయేమొ! అతని యెముకలన్నీ బయటపడివున్నాయి. శరీరం నుండి మురికి వాసన గుప్పునికొడుతుంది. ఒంటి నిండా గుడ్డలేదు. అతని చూపులో దీనత్వం, బాధ గోచరిస్తుంది. ఆవ్యక్తి చేతిలో ఓసంచి వుంది. ఆ సంచిలో యేమున్నాయోనని చెయ్యానులు ఆలోచించాడు. ఆదృశ్యంలో చెయ్యానులుకు యేమింతా గోచరించలేదు. అయితే అతనిచుట్టూ అంతమంది దేనికి చేరి వున్నారోగూడా తెలియలేదు.

ఆగుంపులో అంతమంది నిశ్శబ్దంగావున్నారు. ఆవ్యక్తి ఆబండమీద అంతసేపు యేమీకదలలేదు. చెయ్యానులు వచ్చి అరగంట దాటింది. చెయ్యానులుకు యిక నిలువడానికి విసుగుపుట్టింది. ప్రక్కనున్న వారితో ఆవ్యక్తినిగురించి తెలుసుకోవడానికని సంప్రదించాడు. వారు చెప్పినమాటలతో చెయ్యానులు యెంతో సంతోషించాడు.

ఇన్నాళ్ళుగా తను బొమ్మలను చూడగలిగాడు గాని, వాటి చిత్రకారుని మటుకు చూడలేక పోయాడు. వారి మాటలతో యిప్పుడతనిని గూడ చూడగలిగాడు. ఇంతకుముందుగా చిత్రకారుని సామాన్యునిలా చూడగలిగాడు. అప్పుడతనికి ఆ వ్యక్తిమీద యే అభిప్రాయంలేదు. ఇప్పుడా వ్యక్తి తన అభిప్రాయంలో ఓగొప్పవాడు. అతనిని గురించి తనెన్నాళ్ళుగానో ఆలోచిస్తున్నాడు. కానీ అతనెలా వుంటాడో తన వూహకేరాలేదు. ఇంతకుముందు సామాన్యునిలా చూచినవానిమీద యిప్పుడు ఓ గౌరవాభిప్రాయం చూపుతున్నాడు. ఇంతకుముందు తనకు అపరిచితుడు. ఇప్పుడతను అతని చిత్రాలమీదగా తనకు పూర్తిగా పరిచితుడయ్యాడు.

అతనిపేరేవో యెవ్వరికీ తెలియదు. అతడు యెవ్వరితో మాట్లాడడు. అతనికి నా అనేవారు యెవ్వరూ లేనట్టుంది. ఇంతజగంలో అతనొకడయేకాకి. అతనికి సహాయకులున్నారంటే అతని సంచిలోనివస్తువులే! అవే తను చిత్రాలువేయడానికి వుపయోగించే సాధనాలు బొగ్గులు! అతనికి చిత్రాలు వ్రాయడానికి ఒకవేళలేదు. మిడిమిడికాలే మిట్ట మధ్యాహ్నంలో రోడ్డుమీదనిలబడి బొమ్మలువేస్తాడు. కటిక చీకటితో కప్పబడ్డ అర్ధరాత్రిలో బొమ్మలు వేస్తాడు. అదీ అతనికి తోచినపుడే! అతను ఒకరి ఆహ్వానం మీద యింతవరకు ఒకబొమ్మకూడా వేయలేదు. ఇక బల వంతంమీద యింతవరకు ఒక బొమ్మకూడా వేయలేదు.

ఇక బలవంతంమీద ఆ చిత్రకారుని చేయి కదలనే కదలదు. అందుకనే తెలసిన వారెవ్వరూ అతనిని చిత్రాలు వేయమని అడుగరు.

చెయ్యానులు యిలాంటి విషయాలు అతనిని గురించి తెలుసుకున్న తర్వాత పూర్తిగా నిరుత్సాహపడ్డాడు. అతడు తనతోనూ పలుకడేమో! అందరూ అతనిని నీచంగా; చూడనమ్ము తనుమటుకు అతనిని తనహృదయంలో యెంతో గౌరవించాడు. అలాంటప్పుడు తనతో మాట్లాడడానికేమనుకున్నాడు చెయ్యానులు.

మెలగా చీకటి పడుతున్నది. పడమటి చుక్క మినుకు మినుకుమంటుంది. మునిసిపల్ మార్కెట్ లైటు అప్పుడే వెలిగింది. అక్కడ చేరివున్న జనం ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. ఒకటిన్నర గంటనుండీ ఆ చిత్రకారుని చెయ్యానులు కనిపెడుతూ నేవున్నాడు. అతనింతవరకు కదిలినట్లేలేదు. చెయ్యానులు పట్టుదల గూడా జాస్తయింది.

అతని చుట్టూవున్న జనం పూర్తిగా వెళ్ళిపోయారు. తనొక్కడే మిగిలాడు. ఎట్లయినా ఆ చిత్రకారుని తనగదికి తీసుకపోవాలని నిశ్చయించుకున్నాడు చెయ్యానులు. ఆసమయంలో ఆ చిత్రకారునిగురించి చెయ్యానులు మనసులో యెన్నో ఆలోచనలు మెదిలాయి.

చెయ్యానులు ఆచిత్రకారుడు తన తట్టు చూడడం గమనించాడు. అతనిని యెలాసంబోధించాలో చెయ్యానులుకు అర్థంగాలేదు. ఆ చిత్రకారుని మెల్లగా పిలిచాడు. అతనేం పలుకలేదు. మరలా పిలిచాడు. అతని మౌనం అప్పటికీ వదలలేదు.

ఆ చిత్రకారుని చేతిలోని సంచి జారిపడింది. చెయ్యానులు ఆ సంచిని తీసుకున్నాడు. అయినప్పటికీ

ఆ చిత్రకారుడు తనదికాదన్నట్లు ఊరుకున్నాడు.

చెయ్యానులుకేం తోచలేదు.

అతను తనతో మాట్లాడడు.

తనే మాట్లాడాలనుకున్నాడు చెయ్యానులు.

"ఏమండీ మీపేరేమిటి" అని అడిగి తనడిగింది సబబేనా అని ఆలోచించసాగాడు చెయ్యానులు.

అయినప్పటికీ అతనేం పలుకలేదు.

"మీరు నాతో రావడానికి సంకోచిస్తున్నారా?" అన్నాడు చెయ్యానులు.

అతను లేదని తలవూపాడు.

చెయ్యానులు ఆనందం పట్టలేకపోయాడు. ఇంత సేపటికిగాను అతను కదలడం యిదే మొదటిసారి.

"అయితే మీరు నాతో రావడానికి దేనికి సంకోచిస్తారు?"

ఆ చిత్రకారుడు మౌనం వహించాడు.

"మీకు యేకీడు కలిగించను - దయచేసి నాతో రాగలరా?"

తను మాట్లాడిన మాటలతో ఆ చిత్రకారుడు మెల్లగా కదిలాడు. తనింతవరకు యిలాంటి సంభాషణ యెవరితో చేసివుండలేదు. తన మాటలనుబట్టి చూస్తే ఆ చిత్రకారుడు సమాజంతో కలసివుండడానికి దేనికో భయపడుతున్నాడు.

చెయ్యానులు, ఆ చిత్రకారుని నాలుగైదు సందులు త్రిప్పి తన గదికి తీసుకవెళ్ళాడు. త్రోవలో ఆ చిత్రకారుడు యంత్రంలా చెయ్యానులుతో నిశ్శబ్దంగా నడకసాగించాడు. చెయ్యానులు గదిలో చీకటిగా వుంది. చెయ్యానులు లైటు వేశాడు. ఆ విద్యుద్దీప కాంతిలో ఆ చిత్రకారుని బాగా పరకించాడు. శరీరమంతా మురికితో నిండివుంది. అతనిని శుభ్రంగా స్నానంచేయించి, కట్టుకోను తన పంచ తీసిచ్చాడు. ఇప్పుడతను సామాన్యపు మనిషయ్యాడు. మునుపటి రూపంతా మాసిపోయింది. తనకు, అతనికిగాను ఓ క్యారియరు భోజనం తెప్పించాడు. ఆ చిత్రకారుని కానాడు యెంత ఆకలిగా వుణ్ణిందో, చెయ్యానులు సగం కడుపుతోలేచి తృప్తిపడ్డాడు. తన పడక శుభ్రంగా వేసి అతనిని కూర్చోమన్నాడు. చెయ్యానులు చేయమన్నదంతా యంత్రంలా ఆ చిత్రకారుడు చేయసాగాడు.

చెయ్యానులుకు అతని చరిత్ర పూర్తిగా తెలుసుకోవాలన్న వుబలాటం జాస్తయింది. "మీ రిలా దేనికున్నారు? మీవారెవ్వరూలేరా?" అని అడిగాడు చెయ్యానులు. అతను తలవూపాడు. చెయ్యానులుకు అతనితో సంభాషణ సాగించడానికి మాటలు రాలేదు.

ఆ చిత్రకారుడు మెల్లగా తలెత్తి చెయ్యానులుతట్టు చూచాడు. ఆ చూపులో దీనత్వం నిండివుంది. తను మాట్లాడిన మాటలకు నొచ్చుకున్నాడు చెయ్యానులు.

"మీరు నాకథ వినదలచుకున్నారా?" అని మెల్లగా అడిగాడు ఆ చిత్రకారుడు.

అదే తన ఆశయంగూడా. దానికోసమే తనింత సేపు కాచుక్కూర్చున్నాడు. ఆ చిత్రకారుడు తన కథ చెప్పడం మొదలుబెట్టాడు.

"నాకథ మీరు వింటారు - విని యేమనుకున్నా సరే దానికి నేను బాధ్యుణ్ణికాను. నా జీవితంలో మీకు క్రూరత్వం కనిపించవచ్చు - దానివలన మీకు నామీద అసహ్యతకలుగవచ్చు. నాకథ మీకు వినడానికంతగా యిష్టంలేకపోవచ్చు. విసుగు కలిగించవచ్చు - విసుగు కలిగించినా మీరు వినితీరాలి. నా కథవిని నా జీవితానికి మీరు యేసానుభూతినీ చూపనక్కరలేదు. కానీ చూపకుండా వుండలేరు - అలా వుండగలిగితేనే నా కానందం."

"నాజీవితం వెలివేయబడింది. నేను వెలివేయబడ్డాను. అది మూఢనమ్మకాలతో నలిగిపోతున్న సమాజంలోనే. ఇంకా యీ సమాజంలో మూఢనమ్మకాలు వెలివేయబడలేదు. అందుకనే యిప్పటికీ నేను వెలిగావున్నాను. వెలిలోనే నాజీవితం అంతమవుతుందేమో! నేను పుట్టటంగూడా వెలి

వేయబడ్డ రక్తంలోనుండే పుట్టానట. అది మీరు నమ్ముతారా ?” అని చెయ్యానులును అడిగాడు.

చెయ్యానులేమీ పలుకలేదు. అతను మరలా చెప్పడం మొదలు బెట్టాడు.

“నమ్మితే నమ్మండి. నేను పుట్టాను. నాదీ మీవంటి ఆశలు, ఆశయాలు, కష్టాలు, సుఖాలుగల జీవితమే! నన్ను వెలివేసినా నేను బ్రతకాలి. నేనీ ఆంధ్రదేశంలో ఓ మారుమూల పల్లెలో పుట్టాను. దేవుడు నన్నా వూరిలో పుట్టించినందుకు యిప్పటికీ అతనిని దూషిస్తాను. అది నా తెలివితక్కువేమో! ఈ సమాజంలో నన్ను పుట్టించినందుకు అతనిని దూషిస్తున్నానేమో! నేను పుట్టడంతోటే మావూరు దగ్ధమైందంటారు. మా వూరెలా కాలిందో నా జీవితమలా మండిపోతున్నది. నేను పుట్టకముందే తండ్రిలేనివాడినయ్యాను. అందుకని నా పుట్టుకకుముందే నామీద మా తల్లికి కోపమట. కానీ మా తల్లిదండ్రులెలావుండేవారో నేనెరుగను. అంటే మాతల్లి నే పుట్టిన వెంటనే ... ”

అతని నోటినుండి మాట పెగలలేదు. అతను కాసేపుయేడ్చి కన్నీళ్లు తుడుచుకున్నాడు.

“మాతల్లి చనిపోయింది. నన్ను పెంచేవారెవ్వరూ లేరనుకోకండి. నాకంటె ముందర యీ సంఘానికి, దాని మూఢ నమ్మకాలకు బలైన మా అక్కయ్య నన్ను పెంచింది. మేమిద్దరం వెలివేయబడ్డవాళ్ళమే. నేను పుట్టేటప్పటికి మా అక్కయ్యకు ఆరేళ్లుండేవి మా అక్కయ్య నన్నెలా పెంచిందో తలచుకుంటే నా హృదయం తరుక్కుపోతుంది. అప్పటికి, మేమనాథులమైన పిదప యీ సంఘానికి దయ గలిగింది. మా అక్కయ్య ఇంటింటా చాకిరిచేసి తన పొట్టను, నన్ను పోషించుకునేది. నాకు తల్లికొరత తీరిందంటే ఆమేనని చెప్పాలి. మా తలిదండ్రుల కాస్తులు, పాస్తులుండేవేమో నాకు తెలియదు.

“నాకు దేవుడేదీ కల్పించలేదు. తుదకు యేదీ లేకుండా జేశాడు. తల్లిలేదు; తండ్రిలేదు-అప్పటికి నాకు మిగిలినది యీ చిత్రకళే! నేనా చిన్న వయసులోనే మంచి మంచి బొమ్మలు రాతిచిప్ప పెంకులతో అరుగులమీద వేసేవాణ్ణి. దానికి మావూళ్లో వారందరూ నన్నెంతో మెచ్చుకున్నారు. ఆ మెప్పులు నాకేమీ తెలిసేవికావు.”

“నేను పెరిగి పెద్దవాణ్ణయ్యాను. మరలా సంఘంలో మాకన్నీ యెదురయ్యాయి. ఆ వూరిలో వారందరూ మమ్మల్నెంతో నీచంగా చూడసాగారు. మా అక్కయ్యనుగూర్చి అప్పటినుండీ నేనెంతో చింతించేవాణ్ణి. ఆమె రజస్వలయింది. అప్పటినుండీ నేను కష్టపడి పనిచేయవలసివచ్చేది. దానివలన నాకే చదువూ రాలేదు. కానీ నా పుట్టుకతో వచ్చిన యీ చిత్రకళనే నభివృద్ధి చేసుకోవడానికవకాశమివ్వకపోయినా అదే అభివృద్ధయింది.”

“మా అక్కయ్య సమస్య నాకు ఆ వయసులోనే ఓ పెద్ద సమస్యలా తయారయింది. మా అక్కయ్యకు పెళ్ళీడు సమీపించి దాటిపోయిందికూడా. ఆ వూరి యువకుల కండ్లన్నీ మా అక్కయ్యమీదనే వుండేవి. నేను యేమీచేయలేక హృదయభారంతో కుమిలిపోయేవాణ్ణి. రాత్రిళ్లు మా వూరిపాకచుట్టూరూ వూరివారు రాకపోకలు సాగించేవారు. మా యిద్దరి పొట్టలు నా ఒక్కడి రెక్కలమీద నిండడం దుస్సాధ్యమయింది. మా అక్కయ్యగూడా పనికి పోను మొదలు బెట్టింది.

“ఆ నాడు ! - ఆ రోజే ఆ వూరికి మాకు ఋణం తీరిపోయింది. మా అక్కయ్య పొలంలో పనికి వెళ్ళింది. నేను యింటిలోలేను. యెండలు మిక్కుటంగా వున్నందువలన నేను అలా చింత తోపుకు వెళ్ళాను. సాయంత్రం తిరిగి వచ్చేటప్పటికి యింటిలో మా అక్కయ్య యేడుస్తూంది. కారణం తెలుసుకున్నాను. ఆ వూరి ఓ రౌడీవెధవ మా అక్కయ్యను బలవంతచేశాడు. యెలాగో తప్పించుకుని యింటికి చేరుకుంది. ఆ మాటలువిన్న నా హృదయం దహించుకుపోయింది. నా రక్తం వుడికిపోయింది. కానీ

నాలోవున్నశక్తి కసితీర్చుకోడానికి అప్పుడు చాలింది గాదు. ఇక మేమిద్దరం ఆ వూరిలో వుండలేక పోయాం. ఆ రాత్రే ఆ వూరు విడిచి బస్తీకి బయలు దేరిపోయాము."

"అప్పటికి నేను బాగా పెద్దవాణ్ణయిపోయాను. నా ఒక్కనిశక్తి మా యిద్దరి జీవితాలను పోషించడానికి సరిపోయేదికాదు. నాకు బస్తీలోఓ బస్సు కంపెనీలో క్లీనరుగా పనిదొరికింది. మా అక్కయ్య ఓ మహారాజింట్లో చాకిరికి కుదిరింది. ఆ మహారాజింట్లోనే ఓ కొట్టు మేముండడానికిచ్చారు. మా జీవితం ఒక విధంగా గడిచిపోతుండేది. నేను నా వూహకందిన చిత్రాలు, యితర సుప్రసిద్ధ మహా పురుషుల చిత్రాలు రచించి కొద్దిగా డబ్బు గడించేవాడిని. అప్పటికి నాహృదయ భారం కొద్దిగా తగ్గింది. మా జీవితం ఒక మంచి మార్గంలో పడబోతున్నందుకు యెంతగానో సంతోషించాను" (సశేషము)

——(o)——

# శ్రీమతి రామేశ్వరి నెహ్రూ

(పద్మ భూషణ్)

శ్రీమతి రామేశ్వరి నెహ్రూ 1886 డిసెంబరులో జన్మించారు. ఆమె 1909లో ప్రజాసేవా రంగంలో ప్రవేశించి అలహాబాదులో మహిళాసమితిని నెలకొల్పి, 'స్త్రీ దర్పణ్' అనే హిందీ పత్రికను ప్రారంభించారు. ఆమె ఆ పత్రికకు 16 సంవత్సరాలు సంపాదకులుగావున్నారు. 1934వ సంవత్సరంనుంచీ ఆమె మహాత్మాగాంధీ అడుగుజాడననుసరిస్తూ, హరిజనోద్ధరణకు పూనుకొని, హరిజనాభ్యుదయానికి కృషిచేస్తూ దేశమందంతటా పర్యటించారు.

శ్రీమతి నెహ్రూ 1974 నవంబరులో న్యూఢిల్లీకి వచ్చి ప్రభుత్వ కోర్కెపై పునరావాసకల్పన మంత్రిత్వ శాఖ లో ని మహిళాశాఖకు గౌరవ డైరెక్టరు పదవిని స్వీకరించారు. పశ్చిమ పాకిస్థాన్ నుంచి వచ్చిన నిర్వాసస్త్రీలయొక్క పిల్లల యొక్క సంక్షేమానికి వారు కృషిచేస్తున్నారు. 1949 మార్చిలో ఆమెను అదే శాఖలో గౌరవ సలహాదారుగానియమించడంతో వివిధరాష్ట్రాలలోను అనాధశరణాలయాలను, బాలసంక్షేమ కేంద్రాలను అజమాయిషీ చేసే అవకాశం ఆమెకు లభించింది. ఆ సంక్షేమ సంస్థలలో1950లో 31,000 మంది, 1953 ఆఖరికి 28,850 మంది ఆశ్రయం తీసుకొన్నారు.

శ్రీమతి రామేశ్వరీ నెహ్రూకు అనేక సాంఘిక సంక్షేమ సంస్థలతోను, స్వచ్ఛంద సేవాసంస్థలతోను సన్నిహిత సంబంధమున్నది. ఆమె సహనశీలతకు నిస్వార్థ సేవకు, కార్యదీక్ష అనేకమందిచేత ప్రశంసించబడ్డాయి. హరిజనోద్ధరణకు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నదనడానికి 1949లో నిర్మించబడిన "రామేశ్వరీ నగర్" ప్రబల నిదర్శనం. నిర్వాసులైన హరిజనులకు ఆ'నగర్' నిర్మించబడింది.

(ఇండియా ప్రభుత్వ సమాచార కార్యాలయం)